క్లుప్తంగా

సరిహద్దుల్లో నిఘా పటిష్టం



చెక్‌పోస్టులో తనిఖీ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కంబదూరు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆంధ్ర–కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పటిష్టం చేశామని డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పావగడ రహదారిలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా రాత్రింబవళ్లు నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కర్ణాటక నుంచి ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్పీ వెంట సీఐ నాగరాజు, ఎస్‌ఐ యువరాజు, సిబ్బంది ఉన్నారు.

కళాకారుడి మృతి



రంగన్న (ఫైల్)

కూడేరు: మండలంలోని ఇప్పేరుకు చెందిన సీనియర్ నాటక కళాకారుడు బండారు గంగన్న(70) ఆదివారం మృతి చెందారు. గంగన్న మృతి నాటక కళారంగానికి తీరని లోటు అని సంగమేశ్వర నాటక కళా సమితి మండల అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షులు వెంకటేశులు, చిన్న ఓబులేసు, ప్రధాన కార్యదర్శి మలరాయుడు, సభ్యులు అన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సత్యహరిచంద్ర నాటకంలో హరిచంద్ర, గయోపాఖ్యానంలో అర్జున పాత్రలను అద్భుతంగా ప్రదర్శించి అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన మృతికి వారు సానుభూతి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



అలంకరణలో వేంకటరమణుడు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ దేవాలయాల్లో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 గంటల నుంచి పూజలు ప్రారంభించారు. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం, తిరుప్పావై సేవ, పుష్పార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఏకాదశి పూజలు



పూజలందుకున్న రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకం చేసి, మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసి మాలాధారణకు భక్తులు పోటెత్తారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

'కనకదాస' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం: కనకదాస ఉపాధ్యాయ, కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రేవణసిద్ధేశ్వర ఆలయం వద్ద 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాలూకా కురుబ సంఘం అధ్యక్షుడు గురుమాల రాజు, కణేకల్లు ఎంఈఓ లక్ష్మన్న మాట్లాడారు. సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా కురుబల్లో చైతన్యం రావాలన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణకు సహకరించిన హనుమంతు, కృష్ణమీనాను వారు అభినందించారు. కార్యక్రమంలో కురుబ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కే నాగరాజు, కార్యదర్శి పాండురంగ, సంఘం నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, ఎం. ప్రకాష్, లాయర్ సిటీ శ్యామల, కౌన్సిలర్ ప్రశాంతి, శ్రీధర్, తిప్పేస్వామి, వంశీ, నగేష్, మల్లికార్జున, మహేష్ పాల్గొన్నారు.

బస్సుయాత్ర విజయవంతం



సాధికార బస్సుయాత్రకు తరలివచ్చిన జనం



జనవాహిని మధ్య బస్సుయాత్ర



నినాదాలు చేస్తున్న మహిళలు



వైఎస్ జగన్ జెండాలతో సందడి





వైఎస్సార్‌సీపీ కార్యకర్తల బైక్ ర్యాలీ



బస్సుయాత్రలో వృద్ధురాలి ఆనందం



ఆటపాటలతో కళాకారుల సందడి

ఉరవకొండ: నియోజకవర్గ కేంద్రం ఉరవకొండలో ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బహిరంగ సభ జన సందోహంతో నిండిపోయింది. బస్సుయాత్రకు ఉరవకొండ పట్టణం నుంచే కాక ఉరవకొండ రూరల్, విడపనకల్లు, కూడేరు, బెళుగుప్ప, వజ్రకరూరు మండలాల నుంచి వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. బహిరంగ సభలో కళాకారులు డప్పులు వాయిస్తూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలన్నారు. అంతకుముందు పార్టీ యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువత కదం తొక్కారు. వందలాది వాహనాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సెలవు రోజూ పింఛన్ల పంపిణీ



దివ్యాంగుడు గంగన్నకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మహబూబ్‌బాషా

కళ్యాణదుర్గం: ఆదివారం సెలవు రోజూ కూడా వలంటీర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నియోజకవర్గంలో పలు చోట్ల పింఛను పంపిణీ చేసి వలంటీర్లు ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణంలోని 11వ వార్డులో వలంటీర్ మహబూబ్ బాషా స్థానిక కౌన్సిలర్ తిమ్మక్కతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పింఛన్లు అందజేశాడు. ఈక్రమంలో మంచానికే పరిమితమైన 75 ఏళ్ల దివ్యాంగుడు గంగన్న ఇంటికి వెళ్లి పింఛను పంపిణీ చేశాడు. రూ.3 వేలు అందుకున్న లబ్ధిదారుడు సంతోషంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రమేష్, ప్రభాకర్, నాగరాజు, వంశీ, అజయ్, చరణ్, రఘు, చిన్నా, రవి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కళ్యాణదుర్గం రూరల్: 1998–99లో కళ్యాణదుర్గం పట్టణంలోని నార్త్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 25 సంవత్సరాల తరువాత కలవడంతో అప్పటి ఊసులు చెప్పుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు.

పింఛన్ పెంపు చరిత్రాత్మకం



బొమ్మనహాళ్ మండలం హోన్నూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్లు

బొమ్మనహాళ్: సామాజిక పింఛన్ రూ.3 వేలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచడం చరిత్రాత్మకమని పార్టీ మండల కన్వీనర్ రామాంజినేయులు అన్నారు. మండలంలోని దర్గాహోన్నూరు, హరేసముద్రం, దేవగిరి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్ శెట్టి, ఎంసీహెచ్ రాజకుమార్, తిప్పేస్వామి, రామక్రిష్ణ, ఆనంద్ రెడ్డి, జలంధర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కళ్యాణదుర్గం: అవ్వతాతలకు నెలకు పింఛను రూ.3 వేలు అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని కౌన్సిలర్లు అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో ఆదివారం పెంచిన పింఛన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ లబ్ధిదారులతో కలసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 4, 5 వార్డుల కౌన్సిలర్లు కుర్రా రాము, గోపారం హేమావతి తదితరులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, భీమలింగ, పురుషోత్తం, గోవిందరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కలిగిఉండాలి



డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగిఉండాలని ఈఓఆర్‌డీ బాలాజీ సూచించారు. మండలంలోని నారాయణపురం, పాలవాయి పంచాయతీల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం రైతులకు డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలవాయి సర్పంచ్ నాగరత్నమ్మ, పార్టీ తాలూకా అధికార ప్రతినిధి వెంకటేశులు, సచివాలయ కన్వీనర్లు వెంకటేశులు, నారాయణ, నాయకులు నరసింహులు, తిమ్మసెట్టి, ములకన్న, వ్యవసాయ సిబ్బంది, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బహుమతులందుకుంటున్న కరుట్లపల్లి విద్యార్థులు పవన్ రెడ్డి, హరిత, సౌమ్య

కూడేరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలో జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన హైస్కూల్ విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొన్నారు. మండలంలోని కరుట్లపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎస్.పవన్ రెడ్డి(10వ తరగతి), కె.హరిత(9), బి.సౌమ్య(8) ప్రతిభ కనబరిచి ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిష్టారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

నేడు ఎంపీ రాక

కంబదూరు: వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, పార్లమెంట్ సభ్యుడు తలారి రంగయ్య సోమవారం కంబదూరుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పింఛన్ లబ్ధిదారులకు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం



పార్టీ నాయకులతో మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తనను కలవడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. దేశంలోనే గొప్ప విజన్ కలిగిన సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి ఇంటివద్దకే సంక్షేమ పథకాలు చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మోసాలను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో నమ్మబోరన్నారు. దుర్గం కోటపై 2024లోనూ వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొళకూర్తి జయరామిరెడ్డి, ఎర్రగుంట కేశవరెడ్డి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కన్న, రవూఫ్, అతావుల్లా, తాళ్లకెర వీరభద్రారెడ్డి, వరకూటి నవీన్‌కుమార్‌రెడ్డి, కో–ఆప్షన్ దిలవర్‌బాషా, మాజీ జెడ్పీటీసీ హెచ్ వన్నప్ప, బీఎన్‌హళ్లీ సర్పంచ్ రామాంజనేయులు, ఉడేగోళం వేమన్న, నాగరాజు, మాజీ ఎంపీపీ నాగరాజురెడ్డి, శంఖర్‌రెడ్డి, గౌని శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో ఐవీఆర్ గుబులు!

- తమ పేరు అడిగారో లేదోనని నాయకుల్లో ఆత్రుత
- సురేంద్రబాబు పేరు లేకపోవడంతో అనుచరుల్లో ఆందోళన



సురేంద్రబాబు పేరు లేకపోవడంతో..

కళ్యాణదుర్గం: టీడీపీ చేపట్టిన ఐవీఆర్ (ఇంటారాక్షన్ వాయిస్ రెస్పాన్స్) కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ నాయకుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే కళ్యాణదుర్గం అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న వారు సర్వేతో సమాలోచనలో పడ్డారు. నియోజకవర్గంలో టీడీపీ టికెట్ ఎవరికి వరిస్తుందోనని ఆ పార్టీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నారు. ఐవీఆర్ సర్వేలో ప్రధానంగా ముగ్గురు పేర్లు ప్రస్తావించి ప్రజాభిప్రాయ సేకరణ జరిగినట్లు తెలుస్తోంది. ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు పేర్లను ప్రస్తావించి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరైతే బాగుంటుందనే విషయంపై ప్రజలతో అభిప్రాయాలను అడిగినట్లు విశ్వసనీయ సమాచారం. కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థిగా ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత అమిలినేని సురేంద్రబాబు పేరు ఇటీవల బాగా వినిపించింది. ఈ క్రమంలో ఆదివారం జరిపిన ఐవీఆర్ సర్వేలో సురేంద్రబాబు పేరు ప్రస్తావించకపోవడంతో అనుచరుల్లో ఆందోళన మొదలైంది. గతంలో మాదిరిగానే ఊరించి చివర్లో టికెట్ ఇవ్వకుండా ఉంటారేమోనన్న అనుమానాలు ఆయన అనుచరుల్లో మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఐవీఆర్ కాల్స్ వచ్చిన అనుచరులు సురేంద్రబాబుకు కాల్స్ చేసి ఏం జరిగింది..? ఐవీఆర్ లో మీ పేరు ఎందుకు రాలేదు..? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పార్టీలోనే గిట్టని వారు డబ్బిచ్చి ఈ సర్వేను చేయిస్తున్నారేమోనని తెలుగుదేశం నాయకుల్లో ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.

ఘనంగా గైబ్‌షావలి ఉరుసు



అలంకరణలో హజరత్ గైబ్‌షావలి సమాధి

కణేకల్లు: పట్టణంలోని రామనగర్‌లో ఆదివారం హజరత్ గైబ్‌షావలి ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హజరత్ గైబ్‌షావలి సమాధిని పూలచద్దర్‌లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్గాలో ఫాతేహాలు చేయించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. నిర్వాహకులు రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేకువజామున తారకరామనగర్ నుంచి దర్గా వరకు షంషీర్‌ను ఊరేగించారు.

పథకాలపై దివ్యాంగులకు అవగాహన

కుందుర్పి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు అమలు చేస్తున్న వివిధ పథకాల లబ్ధి, దివ్యాంగుల సమస్యలపై అఖిల భారత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కుందుర్పిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల విద్య, వైద్యం, ఉపాధి అంశాలపై సక్ష్యం అనే దివ్యాంగుల సంస్థ దేశవ్యాప్తంగా దివ్యాంగులను చైతన్య పరుస్తూ, వారికి సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంఘటన కార్యదర్శి విజయవాడ కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు శీనానాయక్, భాగ్యలక్ష్మి, ఆదినారాయణ,లక్ష్మి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని బొట్టువానివీధికి చెందిన ఓ వివాహిత ఆదివారం ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జ్యోతి, ఎరుకుల హనుమంతుకు 10 సంవత్సరల క్రితం వివాహమైంది. కొంతకాలంగా హనుమంతు తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. తాగుడు మానాలని పలుమార్లు భర్తతో ఆమె గొడవపడేది. భర్త వినకపోవడంతో మనస్తాపం చెందిన జ్యోతి ఆదివారం ఇంటట్ల ఎవరులేని సమయంలో విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' రేపు

కూడేరు: మండలంలోని ఇప్పేరు గ్రామంలో ఈ నెల 9న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ప్రజలకు నిపుణులైన వైద్యులచే వైద్య సేవలందిస్తామన్నారు. పంచాయతీ పరిధిలోని పి. నాగిరెడ్డిపల్లి, అంతరగంగ, ఇప్పేరు ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సూర్య సేవా సమితి కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: పట్టణంలో సూర్య సేవా సమితి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సి.మల్లికార్జున, కార్యదర్శిగా సురేష్, ఉపాధ్యక్షుడుగా గౌని లక్ష్మీరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మల్లారెడ్డి, కోశాధికారిగా మహేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో తాయి శేఖర్, మేకల శ్రీనివాసులు, మామిడి తిప్పేస్వామి, షబ్బీర్, మురళి, ఫణీంద్ర, వన్నూరుస్వామి, నిసార్, నరసింహ, ప్రభాకర్, అస్లాం, గోల్డ్ ఇస్మాయిల్, ఉబేదుల్లా పాల్గొన్నారు.